స్కెచ్

# ఇద్దరి - అద్దరి

"రమణశ్రీ"

పొరపాటే మరి! పెళ్లెందుకు చేసుకున్నారు?

నిన్ను పెళ్లి చేసుకోవడం అక్షరాలా పొరపాటు... నిన్ను నా మెడలో గుదిబండలా తగుల్చుకోవడం గ్రహపాటు—

మీనారావు పెదవులమీద రోషం వణికింది. కళ్లల్లో ఆవేశం తొణికింది. దాన్ననుకరించి, అధఃకరించి, విశాలాక్షి నిలబడింది. పొరపాటుగా ఎందుకు చేసుకోవాలి! గ్రహపాటు ... అదే హేతువుగా అగ్రహపాటు—

మీ యిష్టం వచ్చినట్టు చేసుకోండి! మీ తల కింది మెత్తని... నా బతుకంతా గుత్తకు తీసుకుని ఎలా ఏడిపించగలరో, అలా ఏడిపించండి.

నన్నెదిరించి మాట్లాడేదానివి. నే నవునంటే కాదనేదానివి నువ్వెందుకు నాకు?

ఇప్పు డేమన్నానని, ఏముందని, ఇంత రాద్ధాంతం సిద్ధాంతం చేస్తున్నారు?

నే నవునంటే నువ్వు కాదనటమే! లేనిపోని విషయాలన్నింటికీ వాదమే!

వాదం ఏవుంది? మీరు పదేపదే నన్ను పెళ్లి చేసుకోడం పొరపాటంటా రెందుకు? పాత పాత గాథలు త్రవ్విపోస్తా రెందుకు? ఇదేం లక్షణమని?

బుద్ధిమంతుల లక్షణం. పదేపదే త్రవ్వుకోకపోతే ప్రయోజనం ఏవుంది? ఎత్తిపొడుపు... పెడదారిని సరిదిద్దుకోవడమే! ఇక ముందెప్పుడూ జరక్కుండా ఉండడానికి!

విశాలాక్షి మీనారావు మాటలకి వెగటు పడింది. చాలా కాలంనుంచి, అతడేమన్నా వెగటుపడుతూనే వచ్చింది. ఏవిటీ వ్యక్తి? తన మీద అంత కసెందుకు? తన్నుమానించి, అవమానించి, మాటమాటకీ పోటు పెడతాడెందుకు! అతను కోకిల కూతలనుకుంటే, తనకి కాకి కూత! తగని రోత! - ఇదే స్వభావంలో మాట్లాడుతున్నాడు మీనారావు. కాపురంలో కలతలు అనివార్యం-అదే ఆహారమైతే జీవితంలో అశాంతి పిశాచ నర్తనం చేస్తుంది.

ఎంత తల బద్దలుకొట్టుకొన్నా మీ రర్థంకారు. నన్నిలా బతకనీయండి.

మీనారావు ఏవగింపుగా చూశాడు. నిశ్చలమైన ముఖంలో తేకువ వేకువలా వెలవెల బారిపోతోంది. ఎంత చెప్పినా విశాలాక్షి తన స్వభావం మార్చుకోదు. ఆవిడ కుండేటి కాళ్లు రెండో మూడో కూడా తెలీవు-ఈ కాలమంతా తన పాలిట అపభ్రంశమైపోయింది.

మీ పంచన నన్నెందుకు పడేశారో, అది నా దురదృష్టం. ముందు వెనకలు తెలీక ఇలాగే జరుగుతూంటై. మన విభిన్న ప్రకృతులకి వికృతులంటూ వుంటే అవి మనల్ని ఘర్షణపరిచే స్వాభావికాలు.

ఇంతకీ నేనెంత తెలివి తక్కువవాణ్ణి కాకపోతే, పెళ్ళినాటికే తెలిసిన నిన్ను నేను, పెళ్ళాడ్డం నా అజ్ఞానానికి నిదర్శనం. నా దుర్బల మానవత్వానికి ముద్ర—

అంతకంటె పరమ నైచ్యాం ఉండబోదు. మీ రనుకొంటున్నారు. నేనూ అదే అంటే మీ గుండెని పోటు పెడుతుంది. నిందించేటప్పుడు ఆ నింద తనకి చెందితే పడే వ్యథ గుర్తుంచుకుని మరీ ముందుకు రావాలి.

నీవు నిందార్హ్వవనే ఏమన్నా అంటా. ఆడదానిలో అహంకారం, నిరంకుశత్వం ఎక్కువన డానికి నువ్వే తార్కాణం.

మీ గొప్ప మీరే చెప్పకోవాలి, మీ స్వభావాన్ని మీ స్వభావమే పొగుడుకోవాలి. అప్పుడే గాని మీకు తృప్తి ఉండదుగాబోలు.

ఎంత ఉత్తమ జాతిలో పుట్టామనుకొన్నా నీచ లక్షణాల పాలు కొంతవరకేనా, గ్రహస్థితిని బట్టి లేకపోవు.

నేను నీచురాలనే! తుచ్ఛురాలనే. ఇప్పుడు అర్ధరాత్రి పన్నెండవుతోంది. అనర్థదాయకమైన

సమస్యలు పరిష్కరించుకోబోయే మన సంభాషణలు చాదస్తంగావున్నాయి. మీరేమనుకొన్నా నేనిక మీతో మాట్లాడను.

ఇద్దరిలో ఒకరకం తీరా వహిల్లింది. ఆవేశాలతో అభిభేదాలతో తేనిపోని అనుమానాలతో... జీవితం నీడవెంట నలుపులాసాగుతోంది. వెలుగుకీ చీకటికీ...నీడలున్నాయి. వాటి లక్షణంలో ఉండే అంతర్యాన్ని గమనించుకోనేటప్పుడు వాటి మధ్య అగాధాల్ని ఊహించుకోలేనంత పరిణామాన్ఫుటంగా ఉంటై. ఇది లోకం...ఇదీ లోకాలోకం!

ఒకప్పుడు అద్దంలా ప్రతిబింబించే తత్వం మసకపడి, చీకటిని స్పర్శిస్తూ వర్షిస్తుంది. అప్పుడా మసకలో దౌర్బల్యాలు... పీగిపోతున్న సడలిపోతున్న ఎముకలూ నరాలకిమల్లే వెగటిస్తాయి.

పుట్టిల్లంటే విశాలాక్షికి పంచప్రాణాలు. అలాంటప్పుడు మీనారావు నీటినించి బయటపడ్డ చేపలా గిలగిల కొట్టుకోవలసిందే! వాళ్ళే నాకు ముఖ్యంగాని, మీరుకాదు అని ఎప్పుడేనా విశాలాక్షి అంటే- పొరపాటే మరి! అని తననక తప్పిందికాదు.

పెళ్ళయినదగ్గర్నుంచీ, ఇందుకే తమిద్దరిమధ్య దెబ్బలాట- అది బహిరంగమైనపుడు గలాట. ఇంతకంటె అచ్ఛంగా దాంపత్యం సాగదు కాబోలు!

ఇద్దరి మధ్య కోలాటం వేసుకొనే పోరాటం చాలా అంతరంగికంగా సాగేది. బహిరంగమైనప్పుడు తరంగంలా ఉప్పొంగేది. అందుకే ఏవో కలతల్లాంటి కలతలు తలలువేస్తున్నాయని మమతలు భ్రమతలై సాగుతున్నాయని, ఎవరికీ తెలియదు. తెలిసినా అవి పెద్ద కలహాలకి త్రోవ తీస్తాయని, భ్రమించలేదు.

పరస్పరం విరుద్ధంగా అర్థంచేసుకొని బాధపడుతున్నాం. నన్ను మీరు కాస్త జాగ్రత్తగా అర్థంచేసుకోండి బ్రతికిపోతాను.'

నాకా అవసరం ఎప్పటికీ పట్టకూడదు. నన్ను బట్టి నీవని గ్రహించుకో.

ఒకరికోసం ఒకరేమోగాని, మిమ్మల్ని బట్టి నేనూకాదు, నన్నుబట్టి మీరూకాదు. పురుషులు ఎంతసేపు పౌరుష శీవి ప్రదర్శించినా చివరికి స్త్రీత్వంలో కలిసిపోవలసిందే!

ఆహాఁ అలాగా? పాపం!

ఔను. ఎప్పటికైనా అంతే! పురుషులు స్త్రీలలో కలవాల్సిందేగాని, స్త్రీలు పురుషుల్లో కలవరు.

నీవెంత గింజుకున్నా ఎంత తెలివి ప్రదర్శించినా, పురుషుల్తో స్త్రీలు సాటిరాలేరు-ఓడిపోతారు.

అనుకొంటున్నారు. అంతే! ప్రస్తుతం మీ అనుభవంలో ఉన్నా మీరు గుర్తించలేక పోతున్నారు.

ఆహాఁ అలాగా?

మీనారావు నిశ్శబ్దించాడు వెనువెంటనే సమాధానంతోచక వెక్కిరింతపాలయాడు. ప్రకృతిలో స్త్రీ పురుషుడుగా మారడం, పురుషుడు స్త్రీగా మారడం, కొన్ని శాస్త్ర కారణాలవల్ల సంభవిస్తోంది!

ఇద్దరిమధ్యా ఈ సంభాషణ ఎన్నియుగాలైనా సాగేటట్టుంది. ఈ మాటల్లో అంతర్యమే స్త్రీ పురుషుల జీవన రహస్యాల్ని బహిరంగించే ఉపకరణగా కనిపిస్తుంది! ఇరువురిలో పరస్పరత అన్యోన్యత సిద్ధించనపుడు కలిగే అపకృతి ఏమిటి? నిరాకృతి ఏమిటి?

ప్రశ్నలకి సరియైన సమాధానాల్లో తెలివిలా తెల్లవారుతోంది! మీనారావుకేం తోచిందో వెంటనేలేచాడు రేడియోవేసి, మధురసంగీతాన్ని మేల్కొలాపాడు.

ఆ మృదుమధురగానవాహిని ఇద్దరినీ ఒకదరికి తీసుకొస్తూంటే ఆనందంతో కిలకిలమని నవ్వింది విశాలాక్షి!

---

నువ్వు ఊరికే గాలిలో మేడలు కడతావని ఎవరైనా అంటే బాధపడకు: అవి అలా గాలిలోనే ఉంచు; ఎటొచ్చీ వాటికి అడుగున పునాదులు సమకూర్చు. దానికి ప్రయత్నించు.—థోరో